*ఆ రోజు కార్తీక పున్నమి రాత్రి తొమ్మిదయింది, మా భోజనాలు పూర్తయే సరికి ఆవాళ ఉత్సాహంగా మా యావిడ సంకాయపిండివంటలూ వేసింది ఆరుబయట వెన్నెల్లో పీటలువేసి కొసరి కొసరి వడ్డించింది*

# బావా బావా పన్నీరు

## పాలడుగు వెంకటేశ్వరరావు

అందుకు కారణం మా సూరిబావ రాక అతను మాయావిడకి వేలువిడిచిన పెద్దమ్మ కొడుకు. మా సూరిబావమీదనాకు అపారమైన గౌరవం వుంది. నాకేకాదు అతనంటే మాచుట్టాలందరికీ గురి. కారణం అతను మాటకారి. పైగా వ్యవహర్త. ఇంటెలిజెంటు. హైదరాబాదలో వుంటూ రెండు చేతులా ఆర్జించి పడేండు ఇళ్ళుకట్టాడు. అతనికి పెద్దవయస్సూ లేదు. ఒక ఏడాది అటు ఇటుగా ఇంచుమించు నావయసే వుంటుంది.

మా సూరిబావ త్వరగా భోజనం ముగించి బుగ్గన కిళ్లీబిగించి పడక్కుర్చీలో వాలి నామీద జోకులు వేయటం మొదలు పెట్టాడు. అతని జోకులకి తట్టుకొనగల సత్తా నాకు వుంది కాని ప్రక్కనే మాయావిడ ముసిముసినవ్వులు నవ్వుతూంది.

అందుకని చిరాకేసి రుచులారగిస్తూ భోజన కళని సేవిస్తున్న వాడినల్లా గబగబ కళారాధనని ముగించి చెయ్యి కడుక్కుని లేచి చక్కా వచ్చాను.

'బావా ! ఏమిటోయ్ విశేషాలు?' అంటు మాటకదిపాడు సూరివెన్నెల్ని అనుభవిస్తూ.

"ఏముంటయి? పట్నంవాసివి లిటిగెంటువి నువ్వే చెప్పాలి" అన్నాను.

'లిటిగెంటునా ? !' అని ఆశ్చర్యపోయాడు, సూరి.

'అవునోయి మనవాళ్ళందరిలోను పెద్ద తెలివిగల వాడివని పేరుగదా. అందుకని ఆమాట అన్నాను ఏం తప్పా ?' అన్నాను.

నామాటకి సూరిబావ పకపక నవ్వాడు. నవ్వుతూ వంట బ్రహ్మాండంగా వుందని మెచ్చుకున్నాడు. మెచ్చుకుని ముఖ్యంగా 'అన్నం భలేగా వుందోయి మెతుకులు తెల్లముత్యాల్లా వున్నాయి. ఇటువంటి బియ్యం నేను ఎక్కడా చూడలేదు. ఎక్కడ సంపాదించావు ?' అని అడిగాడు.

నేను గర్వంగా చూశాను. అదీ చూసి మాయావిడ పెదిమ విరిచి ముసి ముసిగా నవ్వింది. 'ఎక్కడ్నుంచి తెప్పించావు బావా? మాక్కూడ ఒక అరబస్తా కావాలి తెప్పిస్తావేంటి?' అన్నాడు సూరి మరల.

'తెప్పించటమా! అంతకర్మ నాకేమిటోయి? వాట్ని 'రాజనాలు' అంటారు మన చేలోనే పండాయి. కావలిస్తే తీసుకువెళ్ళు కాని ఎట్లా తీసుకెళ్తావు? మధ్యలో పట్టుకుంటే గొడవవదా ? ఈమధ్య అసలే గవర్నమెంటు మరీ స్ట్రిక్టుగా వుంటూందటమరి ! ఒక మనిషిదగ్గర రెండు కిలోలకంటె ఎక్కువ వుంటె పట్టుకుని జైలులో పెడుతూందిట' అన్నాను.

సూరి నవ్వి, 'ఆవిషయం నాకు వదిలెయ్యి ఆమాత్రం తెలివితేటలయినా లేకపోతే ఎట్లా బ్రతుకుతామోయి ?' అన్నాడు, గొప్పగా.

నేను చిన్నపుచ్చుకున్నాను.

అది గమనించి 'హాలికులకి కోపం వచ్చినట్లుంది' అన్నాడు సూరి !

'మాకు మిగతావి ఏవున్నా లేకపోయినా దానికి మాత్రం తక్కువ లేదు అన్నయ్యా' అందుకుంది ఆవిడ తగుదునమ్మా అని

'బావకేం తక్కువ చెల్లాయి రాజాసంటి జీవితం. అమృతహృదయుడు ఒకరి సంగతి పట్టదు. తానేమొ తన పూజాదికాలేమొ తన వ్యవసాయమేమొ కడుపే కైలాసం, ఇల్లే వైకుంఠం. ఈ కొండపల్లే సర్వ ప్రపంచమూ' అన్నాడు సూరి.

'నేను ఎన్నడూ ఈ కొండపల్లిదాటి బయటికి వెళ్ళననేగా? నీ ఇది' అని ఉడుక్కున్నాను. సూరి పకపక నవ్వాడు.

నవ్వి, 'నీకేం తక్కువని బావా! రాజయోగం ఏదీ చెయ్యి' అంటు నాచేయి అందుకున్నాడు. వెంటనే మాయావిడ దీపంబుడ్డి తెచ్చింది. 'చచ్చాంరా దేముడా ఏంచెప్తాడో గదా. ఐనా చెయ్యి వప్పచెప్పి ఇప్పుడేమనుకుని ఏం వుపయోగం' అని విచారిస్తూ కూర్చున్నాను.

లొడలొడా వాగుతూ పోయేడు సూరి.

నేను అమాయకుడ్నని, ఏం తెలియదని; చాదస్తుడ్నని, కోపం ఎక్కువని ఏమిటేమిటో చెప్పుకుపోతున్నాడు. నా కిష్టంలేదు. కాని ఏంచేసేది ?

చెయ్యినాది. చెప్పేది సూరి బావ. వినేది మా ఇంటావిడ. 'ఒద్దు మొర్రో' అంటు ఎంత మొత్తుకున్నా వాళ్ళు వినేటట్టు లేరు.

చెప్పి చెప్పి అలిసిపోయేడు సూరి. లొప్పుతున్నాడు. ఇంకా చెప్పమన్నట్టు చూస్తూవుంది మాయావిడ. 'నీకు అట్లాగే కావాలిలే రాస్కెల్' అనుకుని చెయ్యి అప్పజెప్పి కూర్చున్నాను నేను.

అంతలో పిడుగు వదిలెడుసూరి.

మాయావిడ మొహం తెల్లపోయింది.

'శ్రీ కృష్ణ జన్మస్థాన ప్రాప్తి తప్పేట్టు లేదుగదా' అని నిట్టూర్చేడు సూరి, పెద్దదిగా.

'నిజంగానా అన్నయ్యా ! సరిగా చూడు ఇంకొకసారి' అంది తను, కంగారుపడి.

'అక్కడికీ ఒకటి రెండుసార్లు చూశాను అమ్మాయి. ఇదేనెల? అక్టోబరు గదూ ఇంకా నెల రోజులలోపునే తప్పకుండా గీవి పెట్టి వుండి వుంది. బావ కనీసం పదిగంటలపాటయినా నిర్బంధంలో గడపాల్సి వుంటుంది. తప్పదు మరి' అన్నాడు సూరి, గంభీరంగా...

ఆవిడ బిక్కమొహం వేసి ముక్కు చీదుకుంది.

'మరేంభయం లేదు. దిగులుపడకమ్మాయి మేమంతాలేమూ. తప్పించటానికి. అయినా పదిగంటలేగా. నీ కెందుకు నిశ్చింతగావుండు' అంటు భరోసా ఇచ్చేడుసూరి.

'నీ మొహంలే. నువ్వు ఒకపని చేస్తావా ? మాటలపోగువి. చల్లటివేళ ఆడ కూతురిచేత బిక్క మొకం పెట్టించావు తెగవాగుడు. దాన్నే తెలివి తేటలని అనుకుని ఎగిరి పడ్తారు ఈ పిచ్చి మాలోకాలు' అనుకుని—

'ఊ. ఏం బావా ఇంకా ఏంటి ? చెప్పు' అన్నాను, గంభీరంగా.

వెంటనే నాచెయ్యి వదిలేసి సబ్జక్టు మార్చాడు సూరి. 'ఊ. ఏం అమ్మాయి. మనూరు వెళ్లవా? అట్లాతద్దికని కాంతయ్య గారి కనకం, సూరయ్యగారి సీత,

పేరిశర్మగారి పద్మా అందరూ వస్తున్నారని మసూర్నుంచి మొన్న మా అబ్బులు రాసింది. వెళ్ళి నాల్గు రోజులు సర్దాగా అందర్తోగడిపి రారాదూ? ఈ జంజాటాలు ఎప్పుడూ వుండేవేగా?' అన్నాడు, పెద్ద ఇదిగా.

మా ఆవిడ మొహం అంతలోనే విప్పారింది!

ఈ ఆడాళ్ళంతే. పుట్టింటి సంగతి వస్తే సర్వం మర్చిపోతారు.

'కొంప ముంచావుగదరా దేముడా తనని సంతోష పెట్టటాన్కి కొత్త ఎత్తు ఎత్తావ? మరి నాకేందారి? అనుకుని "అదెల్లా బావా! తను మాత్రం ఇదంతా వదిలి ఎల్లా వెడుతుంది? పైగా నాకు ఇబ్బంది గదా" అని, అడ్డం పడబోయాను.

సూరి పకపకనవ్వి 'నీఇబ్బందుల్లేముందిలె బావా. నాల్గు రోజులు అమ్మాయిని సర్దాగా వెళ్లిరానీ. అంతగా అయితే నువ్వు నాతో ఉద్దువుగాని. హైద్రాబాదు చూసి నాల్గు రోజులు సర్దాగా గడిపి వద్దువుగాని'అన్నాడు.

అదీ బాగానే వుందనిపించింది.

అటుతనని పుట్టింటికి పంపినట్లూ వుంటుంది.

ఇటు నేను పట్నం చూసి వచ్చినట్లూ వుంటుంది.

ఉభయ తారకంగా వుందని, వుంటుందని సరేనన్నాను. అది పట్టుకున్నాడు సూరి బావ. పట్నంలో టిప్‌టాప్‌గా వుండాలి. ఈ గావంచా పంచలు, నీరుకావి అంగవస్త్రాలు చూసి నవ్వుతారు అపటాని రూపాయిలు కర్చు పెట్టించి గెల్లావారి కొట్లో బట్టలు తీయించి నాల్గు పాంట్లు నాల్గు షర్టులు కుట్టించాడు. నా పిలకని కత్తిరించటానికి శతధా ప్రయత్నించాడు. కాని ప్రాణంపోయినా అందుకంగీకరించేది లేదని మొండికేశాను నేను.

పాంట్లు—వాడ్ని తగలెయ్య— లూజాగా కుట్టాడు పీర్సాయిబు. అందుకోసమని బెల్టు కొనిపించి నడుంకి బిగింపించాడు సూరి బావ. మొదట్లో పాంట్ కొత్తగా అన్పించింది. తరవాత ప్రాక్టీసువల్ల కొత్త కొద్దిగాపోయినా కొత్త కొత్తగానె వుందినాకు. నా అవస్తకి ఆవిడ ఒకటే నవ్వు. సూరిబావ మూసిమూసి నవ్వులు చెప్పనక్కరలేదు. అతను బడాయి వూస్తారు!

'నవ్వండి నవ్వండి నవ్విన నాపచేనే పండుతుంది' అంటే 'అవునుబావా. నిజం ఎవరెల్లా నవ్వితే మనకేం? నవ్విపోదురు గాక మన కేమి సిగ్గు' అని ఒకటే నవ్వు సూరిబావ.

అట్లతద్ది దగ్గరపడగానె —

ఒక శుభముహూర్తాన అన్నీ సర్దుకొని, ఎన్నో జాగర్తలు చెప్పి పుట్టింటికి వెళ్లింది ఇంటావిడ. ఆవిడ్ని సాగనంపి దిగులుపడుతున్న నన్నుచూసి 'ఏంటి బావా! చిన్న పిల్లాడిలాగ. మనం కూడ హైద్రాబాదు వెళ్తున్నాం గదా. చీరప్.'అంటు నా భుజం చరిచాడుసూరిబావ.

అతని సెలవు కూడ అయిపోవటం వలన ఆ రెండోరోజే మేమూ బయల్దేరాము.

రాజనాల మీద సూరిబావ మోజు పోలేదు. సర్లెమ్మని సిమెంటు బస్తాలో మూట కట్టాము. దానికి ఒక పాతగుడ్డ తొడుగు తొడిగాము. దొంగవనికి సిద్ధపడ్డాము.



'బావా ! నువ్వేం భయపడబోకు. కూడా నేనున్నాగా. అంతా నేను చూసుకుంటాను. ఈ రాజనాలు చూసి మీ చెల్లెలు, పిల్లలు ఎంతో సంతోషిస్తారు. నీ మేలు జన్మలో మర్చిపోలేరు. మనకేంటి బావా. బోల్డు ఇన్ఫ్లుయెన్సు. మనని ఎవడు పట్టుకుంటాడు ?' అంటూ భరోసా ఇచ్చేడు సూరి. రైలెక్కేము.

కాని నా మనసు మనసులో లేదు.

గుండెలు దడదడ మంటున్నాయి.

పాంటు మాటి మాటికి, కిందికి జారి పోతూవుంది.

కాలమాన పరిస్థితుల్ని పట్టి బియ్యం

# బావా బావా పన్నీరు

తీసుకుపోవటం నేరం. పట్టుకుంటే జుల్మానాతో పాటు జైలుశిక్ష కూడా పడవచ్చును—అదీ నా భయం !

అందరూ మమ్మల్ని మా రాజనాల మూటనీ చూస్తున్నట్టు అనిపించి గుండెలు పీచు పీచు మంటున్నాయి—నాకు. అలవాటు లేని పనాయె.

సూరిబావ గల గల వాగుతు ఉన్నాడు అతని ధోరణి అంతె !

అంతలో చీకటి పడింది.

అమ్మయ్య.

ఇంక ఫర్వాలేదు.

చీకట్లో మా మూట ఎవరికంటా పడదు గదా అని మనసు కుదుటపర్చుకున్నాము. సూరిబావ సమయం చూసుకుని చెప్పేడు. 'ఓయి బావా! నీకేం భయంలేదు. నేనున్నాను. ఎవరన్నా అడిగితే చెప్పు. ఆ బియ్యం మూట నీదేనని. వాస్తవానికి అది నీదేగా !'

'భలేవాడివి బావా ! అది నీది గదా నేనిచ్చాను అనుకో. కాని నువ్వుగదా దాన్ని తీసుకు వెళ్తూంట' అన్నాను, తెల్ల మొహం వేసి.

సూరి పక పక నవ్వాడు.

'ఓయి పిచ్చి బావా. నిజమే అనుకో. కాని కాస్త ఆలోచించు. ఒకవేళ కర్మగాలి దాన్ని ఎవడో పట్టుకున్నాడనుకో. అది నాదే అంటానుకో పరే. నన్ను పట్టుకుంటారు అనుకో. అప్పుడు ఏందారి ? నువ్వు ఏంచెయ్యగలవు ? నీకేంతెల్సు ? ఎవరి పరిచయం వుంది? ఏం మాట్లాడగలవు? నన్ను ఎట్లా విడిపించ గలవు? అదే—నిన్ను పట్టుకుంటే — అక్కడ నాకు అందరూ తెల్సు. నా ఇన్ఫ్లుయెన్సు వుపయోగించి నలుగుర్ని తీసుకొచ్చి ఏం కాకుండా చూడగల సత్తా నాకు వుంది. అదీ వుపాయం. ఏమంటావు?' అన్నాడు.

''ఓరి నీ తెలివి తెల్లార. నీ కడుపునిండా తెలివితేటలేగదా అన్యాయంగా నన్ను ఇరికింమతావా. దేముడా? ఏందారి ?'' అనుకొని 'సర్లె బావా !' అన్నాను తప్పక.

'అదీ బుద్ధిమంతుడి లక్షణ మంటే. నీకేం భయంలేదు. నే నున్నాను. నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డం. మరేం దిగులుపడకు.' అని భరోసా ఇచ్చేడు సూరిబావ.

టకటక మంటు రైలు నడిచింది. ఎవరు పట్టుకుంటారో—ఏంగొడవ వచ్చి పడ్తుందో అని—దడ దడ మంటు గుండెల్లో భయం నిండుకుంది.

'ఈ గండం గడిచి గట్టెక్కితే చాలు దేముడా' అనుకొని ప్రాణాలు బిగపట్టుకొని కూర్చున్నాను. సూరి బావకి ఏం పట్టినట్టు లేదు.

'ఓ రాజనాల బియ్యం మూటా ! కొంప ముంచకే. ఇటువంటి గొడవలు ఎప్పుడూ ఎరుగను గదే' అని ఎన్నో ప్రార్థనలు చేసేను. బిక్కమొహం పెట్టేను.

అదిచూసి 'బావా నీకేం భయంలేదు ధైర్యంగా వుండు. ధైర్యే సాహసే లక్ష్మి అంటూ నా బుజం చరిచేడు. సూరిబా: బుజం చరిచినప్పుడల్లా గుండెల్లోని దిగుల క్షణ క్షణానికీ అధికమవుతూ వచ్చింది కా: దాన్నంపదెగ తగ్గనేలేదు.

రోజులు అటువంటివి మరి.

బియ్యానికి కట కట.

దొంగ వ్యాపారం ముమ్మరంగా సాగుతున్న దినాలు.

పట్టుబడిన వాళ్ళు జైళ్ళలో కూర్చొన్న దృష్టాంతాలు నాకు తెల్సు.

మావూరి పుల్లయ్య అటువంటి పనిచేసి ఆరొందలు జుల్మానా కట్టి ఆర్నెల్లు జైల్లో


ఆంధ్ర సచిత్ర వారపత్రిక

చందా వివరాలు (పోస్టుద్వారా)

| | |
|---|---|
| సంవత్సరం చందా | రు. 31–20 |
| 6 మాసాల చందా | రు. 15–60 |
| 3 మాసముల చందా | రు. 7–80 |

విడిప్రతి 55 పైసలు

చందా కట్టవలసిన తపాలా చిరునామా:
మేనేజరు, ఆంధ్రపత్రిక,
గాంధీనగరం, విజయవాడ–3.



కాల్గేట్ టూత్ పౌడర్‌తో
మీ చిగుళ్ళను, పళ్ళను
కాపాడుకోండి. చెడుశ్వాసను
కూడా అరికట్టండి

మీ కుటుంబంకొరకు ఎకానమీ సైజ్ కాల్గేట్ టూత్ పౌడర్ నేడే కొనండి. ఒక డబ్బా నెలల తరబడివస్తుంది. దాని చల్లని, ఉల్లాసకరమైన రుచిని మీరెంతో మెచ్చుకుంటారు !

TP.G.22 TL)

కూర్చుని వచ్చాడు. రైసుమిల్లు రాజయ్య రెండునెలలు కూర్చున్నాడు. ఐతే ఏం ? వాళ్ళకేం సిగ్గా? కాని అటువంటి పరిస్థితే వస్తే నేను ఆపని చెయ్యగలనా ?

ఏనాడూ ఇంట్లో తప్ప బయట ఇన్ని నీళ్ళయినా తాగి ఎరుగనే నిత్యాగ్ని హోత్రినే పైగా నా స్నానం సంధ్యపూజ ఎట్లా కుదిరి చచ్చేట్టు ?— జైల్లోపడితే— ఇదీ నాగొడవ ! అవసరమయితే మలమల మాడి ఛస్తానుగాని జైలుకూడు ఎట్లాముట్టను ?

అయినా ఇదేం కర్మ.

అసలు నేరం చెయ్యాల్సిన అవసరం నాకు లేదే ?

పైగా పరువుమాటేమిటి ?

అటువంటిదే జరిగితే ఎట్లా తలెత్తుకు తిరిగేట్టు తిరిగి ?

'ఎటువంటి కర్మ రాసావురా దేవుడా' సూరిబావ మాఇంటికి రానేల? వచ్చాడు పో. రాజనాలు కావాలని దేవిరించనేల. అడిగితే ఇచ్చాను పో తగుదునమ్మా అంటూ నేనూ అతనితో బయలుదేరనేల ? ఏం కర్మ ? ఇది తప్పి గండం గడిచి బయటపడ్తే కొండకు వస్తానని తిరుపతి వెంకటేశ్వరుడికి మొక్కుకున్నాను.

'బావా మరేం భయపడకు. ఈ బండి అక్కడికి తెల్లవారుఝామున చేరుతుంది. చీకట్లో మన బియ్యంమూటని చూసేవాళ్ళు వుండరు. చీకట్లో చల్లగా బయటపడదాము' అని నాకు ధైర్యం చెప్పాడు సూరిబావ, పెద్ద ఇదిగా.

అట్లా అయినా బాగుండును అనుకున్నాను.

కాని దాని కర్మగాలి కాజీపేటలో క్రాసింగని రెండు గంటలు ఆగింది, రైలుబండి. నాంపల్లి చేరేసర్కి తెల్లగా తెల్లవారింది.

స్టేషన్నిండా జనం. అక్కడక్కడా పోలీసులు.

వాళ్లు అందరూ మా 'రాజనాల బియ్యం మూట'ని పట్టుకుంటానికి వచ్చినట్టువుంది. అందరు తీక్షణంగా, నిశితంగా చూస్తూ వున్నారు, మా వంకే !

'లే బావా! లే. వచ్చేశాం' అన్నాడు సూరి.

లేచాను.

'నేను చెప్పిన మాటలు జ్ఞాపకమున్నాయిగా.'

తలూపాను.

'నీ కేం భయంలేదు. ధైర్యంగా వుండు: లేని భయం పుట్టుకొచ్చి నరాలు వణికాయి.

'ఎవడన్నా అడిగితే ధైర్యంగాచెప్పు. నీదేనని తర్వాత నేను చూసుకుంటాను ఏమయినా ఖర్చు అయితే అన్నీ నేనే భరించుకుంటాను ఏం ?'

తలూపాను.

'కూలీ. కూలీ' అంటూ వుషారుగాపిలిచాడు సూరి. వాడి మొహం చూస్తే చాదస్తుడులా వుంది—ఒక కూలీ వచ్చాడు. బేరందగ్గ రతర్జన భర్జనలయేయి. వాడు రూపాయడిగేడు. సూరి అర్ధరూపాయ ఇస్తానన్నాడు. 'ఏముందం దులో బట్టలేగా' అని వాడ్ని దబాయించాడు సూరి. వాడు మూటని పట్టుకునిలేపి దించి. 'బరువుగా వుందండి. గిట్టదు. రూపాయివ్వండి'అని అన్నాడు. అని, 'బియ్యమా ?' అని అడిగేడు. చిటపట్లాడి వాడ్నికసిరికొట్టి, తింగ్రడించి—'అర్ధరూపాయిస్తాను. ఇష్టమయితేరా.' అన్నాడు సూరి. లేకపోతే పో' అని విదిలించాడు ఇదిగా. 'ఇష్టంకాదండి' అంటు అదోకలా చూస్తూ పోయేడు వాడు.

'ఓయి బావా ! ఎంతోకొంత పదరాదా' అన్నాను. నా గుండెల్లో రైళ్లు పరుగెట్టి గిజగిజ మొదలయింది.

'అది కాదులే. మనం వెంటనేసరే సంటే వాడికి అనుమానం వస్తుంది అందుకని మనం బెట్టుచెయ్యాలి అన్నాడు సూరి పోజు పెట్టి. ''కూలీ. కూలీ.''అంటు పిలిచాడు మరలా.

మొత్తానికి ఆ రూపాయికే మరొకడ్ని మాట్లాడేడు చివరికి సూరి.

తనకీ అనుమానం వచ్చినట్లుంది ! పట్టుకుంటారేమో అని.

మూటని అతనికి ఎత్తి గబగబ బయట పడబోయాము, దొంగల్లాగ.

అనుకున్నంతా అయింది! మిడిగుడ్లతో క్రూరంగాచూస్తూ, బుంగ మీసాలు గల ఒక పోలీసు వచ్చి అడ్డంగా నిలిచాడు. అతని వెనకాల మొదట వచ్చిన కూలీ నిలబడి వున్నాడు. 'కొంప మునిగింది. అనుకున్నంతా అయింది' అని దడదడ్లాడాను.

'ఏంటి ఈ మూటలో?'అన్నాడు పోలీసు.

''ఏమున్నాయి? బట్టలు'' సూరి దబాయించబోయేడు.

'కాదు. అందులో బియ్యమున్నాయని, అనుమానంగా వుంది. నడవండి'

'బియ్యమున్నయ్యా నాకేం తెలుసు ?

### గ్రాడ్యుయేట్ల దేశం

భారత దేశంలో తల సరి ఆదాయం ఏడాదికి 75 డాలర్లు మాత్రం అని ఒక అమెరికన్ సర్వే అంచనా.అయితేనేం భారత్ చాలా గొప్పదేశం కూడానట. ఎందుకంటే అమెరికా, రష్యాలను మినహాయిస్తే యీ దేశంలో వున్నంత మంది సైన్సు గ్రాడ్యుయేట్లు మరెక్కడా లేరుట ! వీళ్ల వుద్యోగాల సంగతి ఆ సర్వే ఎత్తలేదు!

బట్టలేమో అనుకున్నాను' అన్నాడు సూరే.

'సర్లే నడవండి.'

'నాకేంపని ?'

'అదేమిటి ? ఆ బియ్యం మూట మీది కాదూ ?'

'కాదు'

'మరెవర్ది ?'

నా చెయ్యి గిల్లాడు సూరి.

'మరేం భయంలేదు. చెప్పెయ్యి. నేను చూసుకుంటాను' అని గుస గుసలు పోయేడు.

'నాదండి' అన్నాను పాంటు పైకి లాక్కుంటు.

'మీదా?!మరి ఇప్పటివరకూ అయనెందుకు మాట్లాడేడు ? సర్లే రండి ?' అని రైల్వేస్టేషను ప్రక్కన వున్న ఒక ఆఫీసుకు తీసుకెళ్లేడు నన్నూ, మూటనీ.

'ధైర్యంగా వుండు బావా నేను వెళ్లి రాజభూషణంగార్ని తీసుకొస్తాను. త్వరలోనే వస్తాను' అన్నాడు సూరి నా వెనకే వస్తూ.

'రాజభూషణ మెవరు ?' అన్నాను శకునితో జూదానికి కూర్చోబోతున్న ధర్మరాజులా.

'ఆయన సివిల్ సప్లయిస్‌లో ఆఫీసర్లే. ఆయనొచ్చి చెప్పగానె రెండు నిమిషాల్లో ఇంటికి వెళ్లిపోదాము. మరి నేను రానా?' అన్నాడు సూరి.

తలూపాను. సూరి తల ఎగరేస్తు వెళ్లిపోయాడు.

అప్పటికి ఉదయం ఎనిమిదయింది.

పోలీసుతోపాటు నేను అక్కడ్నే కూర్చున్నాను, లోపల యిద్దరు పని చేసుకుంటున్నారు. (ఇంకా వుంది)

## వారఫలం

కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. పుణ్యకార్యాలు చేస్తారు.

తుల :— మీ ప్రయత్నాలు సులువుగా నెరవేరతాయి. పోటీవారిలో గౌరవం లభిస్తుంది. వారం మధ్యలో ఆందోళన కలుగుతుంది. చేజిక్కిన అవకాశాలు కూడా జారిపోవచ్చును. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు బాగుంటాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. విలాస వస్తువులు కొంటారు.

వృశ్చికం :— మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. రావలసిన డబ్బు అందుతుంది. ప్రయోజనంగల పరిచయాలు ఏర్పడుతాయి. వారం ఆఖరులో అనవసరమైన శ్రమ కలుగుతుంది. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

ధనుస్సు :— వృత్తి వ్యాపారాలు లాభదాయకంగా ఉంటాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. పోటీవారితో వాద ప్రతివాదాలు తగవు. ఇతరుల నిమిత్తం శ్రమకు గురికాలగలరు. వారం ఆఖరులో ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. దైవకార్యాలు నెరవేరతాయి.

మకరం :— మీ కార్యక్రమాలు హడావుడిగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో మీరు తలుకొనేది ఒకటి జరిగేది మరొకటి కావచ్చును. స్త్రీలకు పుణ్యకార్యాలు చేస్తారు. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

కుంభం :— వ్యాపార విస్తరణ ప్రయత్నాల బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. మీమంచితనమే మీకు ఇబ్బందిని కలిగిస్తుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మీనం :— మీ శ్రమకుతగిన ఫలితం లభిస్తుంది నూతన వ్యవహారాలు బాగుంటాయి. మిత్రులక సహాయం చేస్తారు. సాహసిక వ్యవహారాల లాభిస్తాయి. వారం ఆఖరులో ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు స్త్రీలకు కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి దైవకార్యాలు నెరవేరతాయి.

*(గత సంచిక తరువాయి)*

'పెట్టుకో నాయనా. నాకేం భయం? మా రాజభూషణరావుగారు వస్తే నువ్వూ నీకేసు పుస్‌మని ఎగిరిపోరూ ? నిన్నుచూస్తే నాకంటె అమాయకుళ్ళావున్నావు. లేకపోతే ఏమిటీ ప్రశ్నట ? ఇటువంటి వాడివి ఈ పట్నంలో ఎలా బ్రతుకుతున్నావు ?' అనుకుని నవ్వునాపుకున్నాను.

'ఏమండి ? ఏం మాట్లాడరు ? కేసు రాయనా ? సీరియస్ అవుతుంది'

ఫకాల్న నవ్వాను.

అతను తెల్లమొహంవేసి 'భలేవారిలా వున్నారే ?' అన్నాడు.

'మీరూ భలేవారిలా ఉన్నారండి' అన్నాను.

'ఏమిటీధైర్యం? నా పదిహేనేళ్ళ సర్వీసులో ఎప్పుడూ చూడలేదు. ఇంతకీ కేసు రాయమంటారా ? సీరియ...'

'రాయండి' అన్నాను మొండిగా.

'సరే చెప్పండి' అని అన్నీ అడిగాడు. చెప్పాను. పేరు, వూరు, చిరునామా అన్నీ అడిగి రాసుకుని కొన్ని కాగితాలు పూర్తిచేసి సంతకం పెట్టమన్నాడు. పరాపరా అడిగిన చోటల్లా పెట్టాను. నాకేం భయమా ?!

అతను జాలిగా నావంక చూసి, 'అక్కడ కూర్చోండి. మాతో చెప్పకుండా మీరు ఎక్కడికీ కదల్టానికి వీలులేదు. మీరు అదృష్టవంతులు. ఇవాళ మా ఆఫీసరుగారు లేరు. ఉంటే ఇప్పుడే మిమ్మల్ని జైలుకి పంపేవాళ్ళము' అన్నాడు.

'నీమాటలు ఎంతసేపులే. మా రాజభూషణంగారు రా రా ఇప్పుడు' అనుకుని అక్కడే కూర్చున్నాను మొండిగా. మొండివాడు రాజుకంటె బలవంతుడన్నారు.

పదయింది.

పన్నెండయింది. వాళ్ళు కాఫీలకి వెళ్ళిన్నారు.

ఏడీ సూరిబావ ! ?

నాలుగున్నరయింది.

'అతను' మరల పిలిచాడు. 'ఏమండీ?'

'ఏమండీ ?'

'మాఆఫీసు మూసివేస్తున్నాము. మరల ఉదయం వస్తాము. జామీను కట్టారా ? లేకుంటే రాత్రల్లా ఈ గదిలో కూర్చుంటారా ?' అన్నాడు.

'ఎంత కట్టాలి ?'

# బావా బావా పన్నీరు

### పాలడుగు వెంకటేశ్వరరావు

'యాభయి రూపాయలు.'

'లేకపోతే...'

'మిమ్మల్ని ఇందులో పెట్టి తాళం వేసి వెళ్తాము పాపం. మీరు ప్రొద్దుట్నించి మంచినీళ్లయినా ముట్టలేదు అనుకుంటాను.'

'ముట్టను.'

'మరి... !'

'అది నాపద్ధతి. ఆహారం.'

'మరిప్పుడేం చేస్తారు ?'

'ఏం చెయ్యమంటారు ? మీరే సెలవియ్యండి.'

అతను నవ్వుకొని 'యాభై రూపాయలు కట్టండి. మిమ్మల్ని వెళ్లనిస్తాను' అన్నాడు.

'ఇదేంట్రా దేముడా' అనుకుని జేబులోంచి తీసి బిళ్ల పెంకుల్లాంటి యాభయిరూపాయలు కట్టాను. తీసుకుని రశీదిచ్చి 'ఇకవెళ్ళండి' అన్నాడు.

'మరల ఎప్పుడు రమ్మంటారు?' అన్నాను.

'వస్తారా? ఎందుకు?' అదోకలాచూశాడు.

'నా యాభై రూపాయలు, బియ్యంమూటా ఇవ్వరూ' అన్నాను...

అతను నవ్వి 'ఇస్తాంలెండి. మీకు త్వరలో తాకీదు పంపుతాము. అప్పుడువచ్చి తీసుకుందురుగాని' అన్నాడు.

'తాకీదు పంపుతారా ? ఇక్కడ వుండమంటారా?' అన్నాను.

అతను పకపక నవ్వి 'మీవూరుకే వస్తుంది. వెళ్ళండి. మీరు భలే వారండి' అన్నాడు.

'మీరూ భలేవారండీ' అన్నాను నిజంగా ఇటువంటి భోళామనిషిని నేనూ ఇంతవరకు చూడలేదు. డబ్బుని, బియ్యం మూటని వదులుకుని పొమ్మంటాడేమిటి ? అందరూ తనవంటి అమాయకులే అనుకుంటాడా ?

ఆఫీసు మూసి అతను అటువెళ్ళాక సూరి వచ్చాడు, నీర్సపు మొహం పెట్టుకుని.

జరిగింది అతనికిచెప్పి 'ఇదంతా నీగురించే జరిగింది. పైసలు నువ్వే ఇవ్వాలి' అన్నాను.

'సరేలే' అన్నాడు ఏడ్పుమొహంతో.

'ఏంటి ? ఏడ్పుమొహం పెట్టావు ? రాజభూషణంగారేరి ?' అన్నాను.

'ఆయన వూళ్ళో లేరు' అన్నాడు. 'నీగురించి వుదయం నుంచి తిరిగి తిరిగి ప్రాణం శోషకొచ్చింది' అన్నాడు.

'నాపనీ అట్లాగేవుంది. ప్రొద్దున నుంచి పచ్చి మంచినీరుకూడా ముట్టలేదు' అన్నాను.

'సర్లెపద బాగానే జరిగింది ఇంతకీ నీ'రాజనాలు' క్షేమంగా వుంచావు.' అన్నాడు.

'ఇప్పుడేమయిందని ? వాడు మనకంటే అమాయకుళ్ళా వున్నాడు. పైగా రసీదులు పుచ్చుకున్నానుగద మన డబ్బు, వస్తువులు ఎక్కడికి పోతాయి? నువ్వేం దిగులు పడకు' అన్నాను ధైర్యంగా.

నాల్గు రోజులు హైద్రాబాదులో గడిపి కొండపల్లి చేరేను, అదప్పుడే మర్చిపోయి.

ఆ సమయాన్కి ఇంటావిడ వచ్చింది. మీకేదో కాగితంవచ్చింది అంటు తెచ్చిఇచ్చింది. 'ఎవడ్రా వీడు ?' అంటు తీసిచూద్దును గదా— కోర్టు సమను !

'ఏమిటండి ?' అంది.

'సర్కారువారు పంపారు'

'ఏమన్నా వుద్యోగం ఇప్పించేడా సూరన్నయ్య హైద్రాబాదులో ?'

'ఆఁ' అంటు చూసేను కాగితాన్ని. ఎడా పెడా.

పదో తారీకున రైల్వే కోర్టుకి హాజరు కావాలని తాకీదు.

తిట్టుకుంటు తిమ్మకుంటు డబ్బు సమకూర్చుకొని రైలెక్కేను. తిన్నగా సూరి దగ్గర కెళ్ళి 'ఇది వచ్చింది ఏం చెయ్యాలి ?' అని నిలదీసేను.

సూరి అది పట్టుకుని హడావుడి పడ్డాడు. తెలిసిన నలుగుర్నీ కలిసి విచారించేడు. ఆ మేజిస్ట్రేటు మహార్నిష్ట బ్రాహ్మడట చిటపట్లాడ్తాడట. నిర్దాక్షిణ్యంగా శిక్షలు వేస్తాడట. ప్రతివాడ్నీ ఒకవూపు వూపుతాడట !

'ఇక లాభం లేదు బావా! నీకు శిక్ష తప్పేట్టులేదు. ఐదారు నెలలు జైల్లోకూర్చోవలసి వచ్చేట్లుంది'అన్నాడు సూరినిస్పృహగా.

'జైలా ! నాకెవడ్రా జైలుశిక్ష వేసేది ? ఏంతప్పు చేసానని ?' అన్నాను చిటపట్లాడి. జైలుశిక్షేపడ్తే నా స్నానం సంధ్యా ఏంగాను? పూజా పునస్కారాలు ఏంగాను? అవే లేకపోతే నేను ఎట్లా బ్రతగ్గలను? అసలు జరిగే పనేనా అని ?'

'అసలు ఇదంతా నీ తెలివి తక్కువ తనం వల్ల జరిగింది' అన్నాడు సూరి. ఆ మాటకి నాకు ఉక్రోషం వచ్చింది.

'నిజమే బావా ముచ్చటపడి అడిగావని 'రాజనాలు' సికివ్వటం, తగుదునమ్మా అని నీవెంటపడి పట్నం రావటం నీమాటలు నమ్మి నువ్వు చెప్పినట్లుగా అంతా నానెత్తిన వేసుకోవటం — ఇదంతా నా తెలివితక్కువతనం గాదూ ?' అన్నాను.

'పైగా వాళ్ళు పెట్టమన్న చోటనల్లా సంతకాలు పెట్టి నెత్తిమీదకు తెచ్చుకున్నావు' అని నిష్ఠురించాడు, నన్ను దోషిగా నిర్ధారణ చేసి

'సరె. తర్వాత' అన్నాను.

'తర్వాత ఏముంది? జైల్లో పెడతాడు!'

'ఇదిగో బావా ! ఉరిపోసుకుని చావనన్నా చస్తానుగాని నేనుమాత్రం జైల్లో కూర్చోను' అన్నాను ఖండితంగా. సూరి బిక్కమొహం పెట్టి 'ఇంతచేసి పైగా నాకు బ్రహ్మహత్యా పాతకం కూడా అంటగడతా వన్నమాట' అన్నాడు రోషంగా.

'నీ కెందుకు బావా ? ఆ పాపం కూడా నాదే. ఆ మాట నేనే వప్పుకుంటున్నప్పుడు ఇంకా ఆ విషయం గూర్చి నీకు దిగులెందుకు ?' అన్నాను దిగాలుగానె.

'అదిగాదు నా బాధ ?'

'మరి ?!'



'నిత్యాగ్ని హోత్రివి. నిప్పువంటి మనిషివి. బయట ఛస్తే మంచి నీరన్నా తాగని వాడివి. బ్రహ్మ తేజస్సుతో వెలుగుతున్న వాడివి. అటువంటి నువ్వు జైలు కెడితే పరువూ ప్రతిష్ఠా ఏంగాను ? ఇది ఏమి ఖర్మ ?'

'నువ్వే చెప్పావుగా బావా !' ఆ రోజు నా చెయ్యి చూసి; నెల రోజుల్లో నాకు జైలు ప్రాప్తి వుందని. ఇది నా కర్మ తప్ప మరొకటి కాదు, గీత అల్లా తగులబడి చచ్చింది. దాన్ని తప్పించటం ఎవరి వశం ? అందుకు నువ్వు విచారించట మెందుకు ?' అన్నాను.

కస్సు మన్నాడు సూరి.

'పోన్లే బావా ! నేను మాత్రం జైలుకెళ్ళి బ్రతకలేను. యజ్ఞోపవీతంతో వురి పోసుకు ఛస్తాను. నువ్వు విచారించకు. నువ్వుమాత్రం ఏంచెయ్యగలవు ? నా గీతే అట్లావుంది. నేను జైలుకెళ్ళిం తర్వాత మీ చెల్లెలికి ఉత్తరం రాయి. శ్రమనుకోక ఒకసారి వెళ్ళిరా.'అన్నాను.

కళ్ళవెంట నీరు పెట్టుకుని బావురుమన్నాడు సూరి. అని నన్ను కావిలించుకుని ఏడ్చాడు.

రాజభూషణంగారు వూళ్ళో లేరట. సెలవు పెట్టి మద్రాసు వెళ్ళారట. అందువలన తన ఇన్ఫ్లుయెన్సు ఎందుకూ పనికి రాకుండా పోయిందట. లేకపోతే ఇంతవరకూ వచ్చేదిగాదు అంటూ సొద వెళ్ళబోసేడు సూరి.

# బావా బావా పన్నీరు

మర్నాడే కోర్టు హియరింగు.

ఆ రాత్రి నిద్రపట్టలేదు నాకు. ఒకటే ఆలోచనలు !

నిద్రలేక కళ్ళు ఎర్రబడినాయి.

స్నానాదికాలు ముగించుకొని పదింటికల్లా కోర్టు కెళ్ళి బయట నుంచున్నాను సూరితో. సూరి మొహంలో జీవకళ లేదు. అతనికంటె నా పరిస్థితే మెరుగ్గా వుంది

అంతలో జనంలో కలకలం చెలరేగింది.

గుమస్తాలు, ప్లీడర్లు హడావుడి పడ్డారు.

మేజిస్ట్రేటుగారు వస్తున్నారట.

అంతలోనే మా ముందు నుంచి తల వంచుకుని టకటక మంటు ఒకరు మెరుపులాటి వాడిలా వెళ్ళారు. ఆయనే మేజిస్ట్రేటు గారట నేను వంచిన తల ఎత్తలేదు. భయంవల్ల ఆయన్ని చూడలేదు. కలకలం తగ్గింది, కాసేపటికి.

అంతలో ఆ వేళ నాచేత సంతకాలు పెట్టించుకున్నాయన కనపడ్డారు. దగ్గరకొచ్చి పలకరించాడు. నమస్కారం చేసాను.

జాలిగా చూసి నవ్వి 'మొదటి కేసు మీదే' అన్నాడు.

అని—'ఒక మాట చెప్తాను. మీ మంచికే. మేజిస్ట్రేటుగారు చండ ప్రచండులు. కోర్టులో ఏమడిగినా ఏం మ్లాడకండి. మాట్లాడితే ఆయనకి కోపం వస్తుంది. ఎక్కువ శిక్ష పడుతుంది. మెదలకుండా వూర్కుంటే దయ దల్చి శిక్ష తగ్గిస్తారు.' అన్నాడు.



తలూపాను.

'ఏం? అట్లా చేస్తారుగా. అమాయికుల్లా వున్నారు, అందుకని మీ మీద జాలి. అంతే.' అని నవ్వాడు. నేనూ నవ్వాను ఏడ్వలేక.

'అసలు ఈ పని మీరే చేసారా అని నాఅనుమానం' అన్నాడు.

'మరేనండి' అన్నాను.

సూరి చిన్నబుచ్చుకున్నాడు.

'అమాయికుల్లా వున్నారు. పాపం. ఎలా తప్పించుకుంటారో ?'అని జాలిపడ్డాడు.

కోర్టు మొదలయింది.

నా పేరు పిల్చారు. సూరి కళ్ళు వత్తుకున్నాడు,

ఏమయితె అయిందని వెళ్ళి బోనెక్కి తల వంచుకుని నిలబడ్డాను. మేజిస్ట్రేటుగారు పులిలా నా వంకే తీక్షణంగాచూసి సకిలించారు, భయంతొ వంచిన తల ఎత్తలేదు నేను.

నా తరఫు వకిలూ ఎవరూ లేరు.

తర్జన భర్జనలన్నీ ప్రాసిక్యూటరుగారు, మేజిస్ట్రేటుగారు పడ్డారు. నన్ను అడిగినా నేను మాట్లాడలేదు. దాదాపు పదినిముషాలు నడిచింది. అంతసేపూ నా కాళ్ళు గజగజవణికాయి.

స్వంత అవసరానికని మనిషి ఒక్కంటికి రెండు కిలోలు తీసుకుపోవచ్చునట. మా మూటలోపదికిలోలువున్నాయట. ఆయనఒక్కడే వున్నాడా లేక కూడా మరెవరన్నా వున్నారా?— అని అడిగాడు మేజిస్ట్రేటు. ప్రాసిక్యూటరు తెల్ల మొహం వేసేడు. 'అది విచారించి నోటు చెయ్యనప్పుడు బెనిఫిట్ ఆఫ్ డౌట్ నేను ఎందుకివ్వకూడదూ?' అని ప్రశ్న వేసాడు మేజిస్ట్రేటు.

చివరకి వందరూపాయలు జుల్మానాపడింది.

అది కట్టకపోతే జైలు శిక్ష! నెల రోజులు. డబ్బుకట్టటానికి నాకు ఆవేళ సాయంత్రం వరకూ గడువు ఇచ్చారు.

సూరి వెళ్ళి వూరిమీద పడి డబ్బు పోగు చేసుకొచ్చి కట్టపోయేడు. తెల్లమొహంవేసుకుని తిరిగి వచ్చేడు. సాయంత్రం నాలుగయింది అప్పటికి!

'ఏంటి ?'అన్నాను.

'ఏం లేదు. నీకు విధించిన జరిమానా ఎవరో ఇదివరకే కట్టేసేరట. చిత్రంగావుంది!

## చిన్నారి చిలిపి చేష్టలు



మాకు ఇద్దరు బాబులు. బుజ్జిబాబుకి 5 సంవత్సరములు. చంటి బాబుకి 3 సంవత్సరములు. మా బుజ్జిబాబు సాయంత్రం స్కూలునుంచి ఇంటికి రాగానే లెక్కలు చేసుకొనేవాడు. ఒకరోజున లెక్కలు వాడికి తెలియలేదని నన్ను చెప్పమన్నాడు. అవి మైనస్‌లు. వాడికి అర్థం అయ్యేలా చెప్పాలని "ఒరేయ్‌బుజ్జి నీదగ్గర 5 బిస్కట్లు వున్నాయనుకో. 3 బిస్కట్లు తమ్ముడు తినేశాడు యింక ఎన్ని వుంటాయి?" అని అడిగాను. వాడు బిక్కమొహంవేసి అటూ ఇటూ చూసి యింక రెండే అన్నాడు. వెంటనే నేను రైట్ అన్నా. వాడికిమాత్రం సంతోషం కలగలేదు సరికదా పెద్దగా ఏడ్పు మొదలు పెట్టాడు.

మా చంటిబాబుకూడా శ్రుతి కలిపాడు. కొంచెం సేపయ్యాక "ఏరా బుజ్జి ఎందుకు ఏడ్చావు?" అన్నాను. "మరేమో తమ్ముడికి మూడు బిస్కట్లు నాకు రెండే కదా అందుకు ఏడ్చా" అన్నాడు మాబుజ్జి. "అన్నకి లెక్కలు చెపితే నువ్వు ఏడుస్తావెందుకూ" అని మాచంటిబాబు నడిగాను. "అదికాదు మమ్మీ అన్న నాకుబిస్కట్లు అసలు పెట్టలేదు. ఎప్పలూ అన్నే ఎక్కువ తీసుకుంటాడు. అన్నీ అబద్ధాలు మమ్మీ నేను మూలు తినలేదు." అని మళ్లీ ఏడుపు మొదలు పెట్టాడు.

—కె.ఎస్. పార్వతి(హైదరాబాదు)

అన్నాడు'. ఎవరు కట్టేరో అడుగుతా వుండు అని కోర్టు ఆఫీసుకి వెళ్లేడు.

అంతలో కోర్టు జవానువచ్చి పల్కరించేడు 'ఫలానా వూరికి చెందిన ఫలానావారుమీరేనా?'

అవునన్నాను.

'అయితే రండి'అన్నాడు.

'ఎక్కడికి?' అన్నాను కంగారుగా.

'మేజిస్ట్రేటుగారు రమ్మంటున్నారు.'

'ఇదేం గొడవ వచ్చిపడిందిరా బాబు! మరల ఏంపితలాటకం?'అనుకుని అతని వెంటవెళ్లేను, కాళ్లవణుకు అణచుకుంటూ.

ఛేంబర్సులో పైపు పీలుస్తున్న ఆ పెద్ద మనిషి నన్ను కూర్చోమన్నాడు.

'ఫరవాలేదండి'అని నిలబడే వున్నాను.

'ఫర్వా వుంది. కూర్చోండ'ని కూర్చోబెట్టి, 'నన్ను గుర్తు పట్టావా?'అన్నాడు. 'లేదండి' అన్నాను.

'సుమారు ఇరవై యేళ్ల క్రితం మనం ఇద్దరం కల్సి చదువుకున్నాము, మీ వూళ్లోనే. నువ్వు నాకు బాగాతెల్సు. అప్పుడు మీ ఇంట్లో 'కరండికర్'అన్న అనాధ బాలుడు వారాలు తిని చదువుకున్నాడు. నేనే ఆ కరండికర్‌ని గుర్తు వచ్చిందా?'

తల వూపాను.

'మరల ఇన్ని సంవత్సరాల తర్వాత నిన్ను చూసి నేను ఎంతో సంతోషించాను. కాని ఈ స్థితిలో నిన్నుచూసి నాకు నేనే చచ్చిపోయినట్లుగా ఫీలయాను. చూపు మాత్రంతోనే అధర్మాన్ని కాల్చి మసి చేయగలశక్తిగలిగినవారు నీ తల్లి దండ్రాదులు. కాని సింహమూ! ఇదేం కర్మయ్యా?'అన్నాడు.

జరిగిందంతా వివరంగా అతనికి చెప్పేను.

అతను నవ్వుకుని 'మరల ఇటువంటి పన్లు చెయ్యమాకు'అని ఇంటికి తీసుకెళ్లేడు, బలవంతంచేసి ఆ పూట భోజనం చేసాకగాని వదిలి పెట్టలేదు.

ఎన్నో కబుర్లుచెప్పాడు. చెప్పించుకున్నాడు. అనుభూతుల్ని నెమరు వేసుకున్నాడు. చివరికి ఒదలలేక వదిలి పెట్టాడు.

ఆ రాత్రే నన్ను రైలెక్కించినప్పుడు సూరి చెప్పేడు. నాకు విధించిన జరిమానా కరండికర్‌గారే కట్టేసారట! ఆరా తీస్తే గుమాస్తా చెప్పాడట!

నేను కట్టిన యాభై రూపాయల డిపాజిట్టూ, రాజనాలముటా తర్వాత తను విడిపించుకుంటానని నాచేత కాగితాలమీద సంతకాలు పుచ్చుకున్నాడు సూరి.

ఇల్లుచేరగానే కరండికర్‌కి వంద రూపాయలూ పంపుతూ ఉత్తరం రాసేను. వారంకల్లా డబ్బుతిరిగివచ్చింది. కరండికర్ నాల్గు పేజీల వుత్తరం రాసేడు.

'మిస్టర్ సింహం! నీ వంటి వుత్తముడ్ని నా కోర్టులో బోనులో నిలబెట్టిన నేరానికి ఆ జుల్మానా నాకు నేనే విధించుకున్నాను. నన్ను క్షమించు'అని ముగించేడు.

సంతోషమూకాని,విచారమూకాని—రెండూ కలిసిన అవస్థకి గురయేను నేను, అప్పుడు

ఆ రోజే సూరి బావ రాసిన ఉత్తరమూ అందింది. స్నేహానికీ, బంధుత్వానికి గల తేడా చిత్రంగా అవుపించింది నాకు!

సూరి ఆరాజనాల మూట,యాభై రూపాయలూ విడిపించి తెచ్చుకున్నాడట!

'ఓయి బావా నీ రాజనాలు' బంగారంగాను నన్ను నానా అవస్తకీ గురిచేసేవు గదోయి ఇందుకు నీకు ఏశిక్ష విధించాలి అని? మొత్తానికి మనశాల్తీలు మనకిదక్కాయి, నీ పరువూ దక్కింది. నీ ఆత్మహత్యాతప్పింది. నీబండపడ. ఏంత థ్రిల్‌ని సృష్టించావు! బియ్యం వండించాను. ఇంట్లో వాళ్లందరూ తిని భేషుగ్గా వుందని మెచ్చుకున్నారు. వీలయితే నీ బాధ్యత మీద మరికాసిని పంపు. ఎడ్వాన్సుగా థాంక్సు!

పోతే; నీ యాభై రూపాయల సంగతి. అనుకోకుండా అదికాస్తా ఇంటికింద ఖర్చయిపోయింది. నిన్నుగురించి నేనెంతశ్రమపడ్డాను? అందువలన ఆ పైకం నా ఫీజుక్రింద జమ కట్టుకున్నాను. నువ్వు సరేనంటావని నమ్మకం. దాన్ని వమ్ము చెయ్యకు. ఏమయినా విశేషాలతో వుత్తరం రాయి' అనిముగించాడు.

అందుకు జవాబుగా నేనేం విశేషాలు రాయలేదుగాని—

'బావా బావా పన్నీరు
బావనుపట్టుకు తన్నేరు
మూలా మంచం వేసేరు
మూడూ గుద్దులు గుద్దేరు' అని ఒక కాగితంమీదరాసి సంతకంచేసి కవరులో పెట్టి సూరికి పంపేను.

అతను అర్థం చేసుకున్నాడో లేదోగాని, ఈ నాటివరకు సూరినుంచి సమాధానమే లేదు!

(అంకితం శ్రీ గండికోట లక్ష్మీనరసింహారావు పంతులు గారికి)

(అయిపోయింది)